ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025
5
విజయనగరం



ఆర్‌టిసిలో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఆర్‌టిసి డిపోలో ఈనెల 20న ప్రారంభం కానున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 20వ బ్యాచ్ లో చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. లైట్ వెహికల్ లైసెన్స్‌లో ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 ఏళ్లు నిండిన వారు ఈ శిక్షణకు అర్హులని, తెలిపారు. శిక్షణ 40 రోజుల పాటు వుంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382924030, 9866649336, 9959225620 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఒబరాయ్ హోటల్ రహదారి కోసం

మరోసారి భూ సేకరణ

- దిబ్బలపాలెం నుంచి తూడెం వెళ్లే రహదారి విస్తరణ
- 80 అడుగులతో వెడల్పు చేసేందుకు నిర్ణయం

ప్రజాశక్తి భోగాపురం

భోగాపురం సరిహద్దులో.. విమానాశ్రయానికి దగ్గరలో సముద్ర తీరాన కొత్తగా నిర్మిస్తున్న ఒబరాయ్ హోటల్ రహదారి కోసం మండలంలోని రెండు రెవెన్యూ గ్రామాల పరిధిలో భూసేకరణకు అధికారులు సిద్ధమవు తున్నారు. దిబ్బలపాలెం గ్రామం నుంచి తూడెం వెళ్లే రహదారిలో రెండు కిలో మీటర్ల రహదారిని వెడల్పు చేయనున్నారు. దీనికి అవసరమైన భూమిని సేకరించనున్నట్లు సమాచారం. ఈ రహదారిని టూరిజం శాఖ ఆధ్వర్యంలో వెడల్పు చేసేందుకు సమాయత్తమవు తున్నారు. దీంతో రైతులు ఎంతో విలువైన భూములను కోల్పోయే పరిస్థితి ఉంది. ఇప్పటికే విమానాశ్రయం కోసం 2700 ఎకరాలు గతంలో భూసేకరణ చేయడంతో చాలా మంది రైతులు భూములను కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా ఒబరాయ్ హోటల్ రహదారి కోసం భూసేకరణ చేస్తుండడంతో రైతుల్లో అందోళన నెలకొంది. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో సముద్ర తీరాన విలువైన 30 ఎకరాలు భూమిని ఒబరాయ్ హోటల్ కోసం కేటాయించింది. ఈ భూమి మండలంలోని కంచేరు రెవెన్యూ సరిహద్దులో విశాఖజిల్లా అన్నవరం రెవెన్యూలో ఉంది. ఈ భూమిలో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఒబరాయ్ సంస్థ సిద్ధమవుతోంది. కాని ఈ భూమిలోకి నిర్మాణ సామాగ్రి వెళ్లాలంటే సరైన రహదారి సౌకర్యం లేదు. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు రహదారి సౌకర్యం కల్పించాలని రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులను కోరారు. ఈనేపథ్యంలో ఇటీవల ఆ శాఖ అధికారులతో పాటు విశాఖ విఎమ్ఆర్‌డిఎ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు వెళ్లి సంబంధిత భూములను పరిశీలించారు.



ఒబరాయ్ హోటల్ కోసం సముద్ర తీరాన కేటాయించిన స్థలం



భూ సేకరణ చేసి వెడల్పు చేయనున్న తూడెం నుంచి దిబ్బల పాలెం వెళ్లే రహదారి

రెండు రెవెన్యూ గ్రామాల్లో భూసేకరణ

చేపలకంచేరు పంచాయతీ దిబ్బలపాలెం నుంచి తూడెం వెళ్లే రహదారిలో ప్రస్తుతం ఈ ఒబరాయ్ హోటల్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి చాలా చిన్నదిగా ఉండడంతో పాటు మట్టిరోడ్డు కావడంతో భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. మరోపక్క దిబ్బలపాలెంలో ఈ రహదారి మరీ ఇరుకుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో భూసేకరణ చేసి రహదారిని వెడల్పు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మూడు రకాల వెడల్పుతో అధికారులు భూసేకరణ ప్రతిపాదనలు కోరారు. ఈ రహదారిని 20 అడుగులతో వెడల్పు చేస్తే కంచేరు, కంచేరుపాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు మూడున్నర ఎకరాలు, 40 అడుగుల వెడల్పుతో అయితే ఆరున్నర ఎకరాలు, 80 అడుగులతో వెడల్పుతో చేస్తే సుమారు 13 ఎకరాలు భూమిని భూసేకరించాల్సి ఉంటుంది. కానీ ఈ రహదారి 80 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఎందుకంటే రానున్న రోజుల్లో ఈ రహదారి గుండా విమానాశ్రయానికి వెళ్లేందుకు ఆ సంస్థకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఉన్న తూడెం వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లుతో పాటు అక్కడ ఉన్న భూముల విలువతో సహా పూర్తి నివేదికను పర్యాటక శాఖకు జిల్లా అధికారులు నివేదించినట్లు సమాచారం.

ఉగాది నాటికి మౌలిక సదుపాయాలు

గిరిజన గ్రామాలకు కలెక్టర్ అంబేద్కర్ హామీ ● ఎమ్మెల్యేతో కలిసి పర్యటన

ప్రజాశక్తి-శృంగవరపుకోట, వేపాడ

ఉగాది నాటికి రహదారులు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని పలు గిరిజన గ్రామాల ప్రజలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హామీ ఇచ్చారు. ఎస్.కోట నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో కలిసి ఆయన శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. గిరిజనులతో గ్రామ సభలు నిర్వహించి వారి సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు.

ఎస్.కోట మండలం పుణ్యగిరి వద్ద రేగ పుణ్యగిరి గ్రామస్తులతో ముందుగా కలెక్టర్ గ్రామసభ నిర్వహించారు. పుణ్యగిరి గ్రామం నుంచి రేగ పుణ్యగిరి గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీలే శరణ్యమని వాపోయారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పోడు పట్టాలు ఇప్పించాలని, తాగునీటి పథకం, ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని గ్రామస్తులు, పలు పార్టీల నాయకులు కోరారు. దీనిపై కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ, రహదారి నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఉపాధి హామీ కింద రహదారిని నిర్మించాలని గ్రామసభ తీర్మానించడంతో, అప్పటికప్పుడే కలెక్టర్ ఆమోదం తెలిపి, వెంటనే పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో వారంలో ఒకరోజు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని కొట్టాం పిహెచ్‌సి వైద్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలోని గర్భిణులకు కాన్పునకు కనీసం వారం రోజుల ముందే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. వారు రాని పక్షంలో ఆ జాబితాను తహశీల్దార్‌కు అందజేయాలని చెప్పారు. జలజీవన్ మిషన్ కింద మంజూరైన రూ.48.40 లక్షల ఖర్చుతో వెంటనే తాగునీటి పథకం పనులు మొదలు పెట్టాలని సూచించారు. ఈ రెండింటిని ఉగాది నాటికి పూర్తి చేయాలన్నారు. 42 కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూములపై సర్వే నిర్వహించి, అర్హత ఉన్నవారికి పోడు పట్టాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అవసరమైన వారికి రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని చెప్పారు. ఇంటింటి సర్వే నిర్వహించి అర్హుల జాబితాలను సిద్ధంచేసి, మార్చి తరువాత వచ్చే కొత్త గృహ నిర్మాణ పథకం కింద వారికి ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. తహశీల్దార్ అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు అధికారులతో పాటు పంచాయతీ కార్యనిర్వాహణాధికారి అనురాధ, జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, సత్యనారాయణ, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ మండలంలో కలెక్టర్, ఎంఎల్‌ఎ లలితకుమారి పర్యటించారు. కరకవలస నుండి పాత మారిక, కొత్త మారిక తదితర ఐదు గిరిజన గ్రామాలకు 10.6 కిలోమీటర్ల మేర ప్రతిపాదిత బిటి రహదారిని పరిశీలించారు. ఇప్పటికే ఐదు కిలోమీటర్ల మేర గ్రావెల్ రహదారిని నిర్మించగా, మిగిలిన పనులను పూర్తి చేయడానికి సుమారు రూ.10కోట్లు వరకు ఖర్చు అవుతుందని అధికారులు తెలిపారు. మిగిలిన పనులను ఉపాధి హామీ కింద పూర్తి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న రేగ పుణ్యగిరి గ్రామస్తులు

డోలీ కష్టాలకు చెల్లు : ఎంఎల్‌ఎ లలిత కుమారి

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎల్‌ఎ కోళ్ల లలిత కుమారి అన్నారు. రేగ పుణ్యగిరి, మారిక గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాన్ని కల్పించడం ద్వారా డోలీ కష్టాలకు తెర పడుతుందని అన్నారు. పర్యటనలో ఆర్‌డిఒ డి.కీర్తి, డ్వామా పీడీ ఎస్ శారదాదేవి, పిఆర్ ఎస్ఇ ఎం.శ్రీనివాసరావు, డిటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, వేపాడ మండల ప్రత్యేకాధికారి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఇఇ మురళీ, వేపాడ జెడ్‌పిటిసి ఎస్.అప్పారావు, ఎంపిపి డి.సత్యవంతుడు, ఎపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, తాహశీల్దార్ రాములమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తెగ తాగేశారు..

ఉమ్మడి జిల్లాలో రూ.41.78కోట్ల మద్యం సేల్

విజయనగరం జిల్లాలో రూ.31.86కోట్లు

మన్యం జిల్లాలో రూ.9.91కోట్లు

మద్యం మత్తులో యువత

వ్యాపారులకు కాసుల పంట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఉమ్మడి విజయనగరం జిల్లాలో సంక్రాంతి పండగ ఐదు రోజులూ మద్యం తెగతాగేశారు. ఎపి బేవరేజస్ ద్వారా ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జిల్లాలోని మద్యం దుకాణదారులు మొత్తంగా రూ.41.78కోట్ల మద్యాన్ని కొనుగోలు చేశారు. దీనికితోడు అప్పటికే దుకాణాల్లోవు ఓల్ట్ స్టాక్ సహా హాట్ కేకులా సేల్ అయిపోయిందట. ముఖ్యంగా యువత భోగిరోజు నుంచే మద్యం మత్తులో మునిగిపోయింది. సంక్రాంతి పండగ అంటే ఒకప్పుడు పిండి వంటకాలు, కొత్తబట్టలు, ఎడ్ల బండిపోటీలు, చిన్నపెద్ద అనే తేడా లేకుండా రకరకాల ఆటల హడావుడి కనిపించేది. ఇంకా చెప్పాలంటే చిన్ననాటి తీపిగుర్తులు చర్చించుకోవడం, బావ మరదుల సరసాలు వినిపించేవి. మారిన పరిస్థితులు వీటి నుంచి క్రమంగా దూరం చేసి, పండగ అంటే పేకాట, మద్యం మత్తే అన్నట్టుగా మారిపోయింది. ఈ ఏడాది జరిగిన మద్యం క్రయ, విక్రయాలే ఇందుకు మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. అసలే తలసరి ఆదాయంలో అట్టడుగు స్థానం ఉన్న జిల్లా. వలస కూలీ కుటుంబాలే ఎక్కువ. అయినప్పటికీ భోగి రోజు నుంచి ముక్కనుమ వరకు వరసగా ఐదే ఐదు రోజుల్లో రూ.41కోట్ల 78లక్షల 65వేల 967 విలువగల మద్యాన్ని తాగేశారు. విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం దుకాణాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలో మెజార్టీ గ్రామాల్లో బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. వీటి ద్వారా విజయనగరం జిల్లా రూ.31కోట్ల 86లక్షల 77వేల 738, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.9కోట్ల 91లక్షల, 88వే 229 చొప్పున మద్యం విక్రయాలు జరిగాయి. ఇరు జిల్లాల్లోనూ సేల్ అయిన మద్యంలో కనుమ, ముక్కనుమ రోజుల్లోనే అత్యధికంగా ఉంది. విజయనగరం జిల్లాలో 15, 16తేదీల్లో సుమారు రూ.14.75కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.4.43కోట్లు విలువైన మద్యం సేల్ అయ్యింది. ఇంటింటా మద్యం ప్రియులు ఉండడం, ముఖ్యంగా యువత ఇంటిపట్టున ఉండకుండా బయట గడపడం వల్ల గ్రామాల్లో కళ తప్పింది. ఇటువంటి సంస్కృతి పెచ్చుమీరడంతో నాటి సంప్రదాయాలు కనుమరుగతున్నాయంటూ పెద్దల్లో ఆవేదన వ్యక్తమౌతోంది. మరోవైపు మద్యం వ్యాపారులకు కాసుల పంట పండింది. మునుపెన్నడూ లేనంతగా మద్యం విక్రయాలు సాగడంతో లాభాలు కూడా అదే స్థాయిలో వచ్చివుంటాయని పలువురు భావిస్తున్నారు.

'హనీ ట్రాప్' ఉచ్చులో పడొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహిళల డిపిలు, వాయిస్, వీడియోలతో వచ్చే కాల్స్‌తో 'హనీ ట్రాప్'లకు పాల్పడే సైబరు నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని, అటువంటి సైబరు నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. శుక్రవారం 'హనీ ట్రాప్' మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'హనీ ట్రాప్' షార్టు వీడియో పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సైబరు మోసాలు పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా షార్టు ఫిల్మ్‌ను రూపొందించి, సైబరు మోసాలు పట్ల అవగాహన కల్పిస్తున్నా మన్నారు. ఇందులో భాగంగా 'హనీ ట్రాప్' పేరుతో కొంతమంది మహిళలు ప్రజలను ఉచ్చులోకి ఏవిధంగా దింపుతారు, ఆయా మోసాల నుండి ఎలా బయటపడాలన్న విషయాన్ని షార్టు ఫిల్మ్ ద్వారా వివరిస్తామని తెలిపారు. ఈ షార్టు ఫిల్మ్ ను సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా ప్రజలకు మరింత చేరువ చేసి, వారిని మరింత అప్రమత్తం చేస్తామన్నారు. ఈ తరహా నేరంలో డబ్బుల కోసం కొంతమంది వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని, వారితో ఫోను, వాట్సాప్ సంభాషనలు, వీడియో కాల్స్ చేసి, ప్రేమ, సెక్స్ పేరుతో ఉచ్చులోకి దించి, వారితో చేసిన సంభాషణలను, వీడియోలను మార్ఫింగ్ చేసి, అశ్లీలంగా మార్చి, ఆయా వీడియోలను సోషల్ మీడియాలోను పోస్టు చేస్తారని, లేదంటే ఫోను కాంటాక్ట్ ఉన్న ఫోను నంబర్లుకు పంపుతామంటూ బెదిరింపులకు పాల్పడతారని, వీటిని వైరల్ చేయకుండా ఉండాలంటే తాము సూచించిన బ్యాంకు ఖాతాకు లేదా ఫోను నంబరుకు డబ్బులు పంపాలని కోరతారని వివరించారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వారికి భయపడి, చాలా మంది వ్యక్తులు భారీగా డబ్బులను నష్టపోడం లేదా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలా బెదిరింపులకు పాల్పడే సైబరు మోసగాళ్ళకు ఎట్టి పరిస్థితుల్లోను భయపడవద్దని, ఎటువంటి ఆలస్యం చేయకుండా వారిపై స్థానిక పోలీసు స్టేషనులోను లేదా సైబరు క్రైం పోర్టల్ కు లేదా 1930కు ఫోను చేయాలని ప్రజలకు ఎస్‌పి కోరారు. మనకు పూర్తిగా పరిచయం లేని వ్యక్తులతో చాటింగు చేయడం, సంభాషించడం, న్యూడ్ ఫోటోలను పంపడం, వారి ఉచ్చులో పడడం ఈ తరహా నేరాలకు ప్రాథమిక కారణంగా మారుతున్నాయని ఎస్‌పి తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఈ షార్టు వీడియోను రూపొందించిన విశాఖపట్నంకు చెందిన మీడియా ఎఫెక్స్ సభ్యులను, షార్టు ఫిల్మ్ లో నటించిన పి.హరిని ఎస్‌పి అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఎఫెక్స్ మీడియా యజమాని సంతోష్, హరి , సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్, పోలీసు సిబ్బంది

మార్చి నాటికి పూడికతీత పనులు పూర్తి

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి నాటికి ప్రధాన కాలువలు, గెడ్డలలో సంపూర్ణ పూడికతీత కార్యక్రమాలు పూర్తి చేయాలని సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లన్నయ్య ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం నగరంలోని 10వ డివిజన్ బొందిల గూడెం, అశోక్ నగర్, రింగ్ రోడ్ రైతుబజార్, గౌడ వీధి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణం తగు సూచనలను సిబ్బందికి జారీ చేశారు. ముఖ్యంగా కాలువల పరిశుభ్రత, రహదారుల మరమ్మత్తులు, పూడికతీత కార్యక్రమాలను గమనించారు. నిబంధనలను అతిక్రమించి కాలువలపై చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. రహదారులను ఆక్రమించి బడ్డీలు, చెత్తాచెదారాలను ఉంచిన వారిని మందలించారు. రింగ్ రోడ్డుకు అనుకొన్న కల్వర్టుకు మరమత్తు పనులు చేపట్టాలని ఎఇ పార్వతీకి ఆదేశించారు. బొందెల గూడెంలో ఉన్న గెడ్డలో పూడికతీత చేపట్టాలని సూచించారు. అశోక్ నగర్ లో ఉన్న పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆ ప్రాంతంలో సామాజిక మరుగుదొడ్డి మరమ్మతులకు అంచనాలు రూపొందించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, పారిశుధ్య పర్యవేక్షకుడు షాలెం రాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న కమిషనర్

అనధికార నిర్మాణాలపై ఉపేక్షించేది లేదు

నగరంలో అనధికార నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోమని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. 31వ డివిజన్ పద్మావతి నగర్ ఫస్ట్ లైన్, రోడ్డు నెంబర్ 1ఎ ప్రాంతంలో అనధికారికంగా భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బంది అక్కడికి వెళ్లి భవన నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అక్రమ నిర్మాణంగా గుర్తించి తక్షణమే నిర్మాణ సామాగ్రిని తరలించడంతోపాటు భవన నిర్మాణాన్ని తొలగించారు. భవన నిర్మాణానికి అవసరమైన సిమెంట్ స్తంభాలను కూడా తొలగించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. వెంటనే సిబ్బంది పిల్లర్లను కూడా తొలగించే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను చేపట్టినట్లయితే తక్షణమే తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఒ అప్పలరాజు, టి పి ఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.



లాంగ్‌జంప్ చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థి

12వ రోజు 373 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్ష ప్రక్రియ సజావుగా సాగుతోంది. జిల్లా పోలీసు గ్రౌండ్‌లో 12వ రోజు శుక్రవారం నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 475 అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 373మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్, అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

కొనసాగుతున్న రద్దీ

బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట

ప్రజాశక్తి-బొబ్బిలి/ విజయనగరం కోట

సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం చేయడంతో జిల్లాలోని ఆర్‌టిసి బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండగ ముగియడంతో ఇతర ప్రాంతాలలో జీవనోపాధి పొందుతున్న వారంతా ఆయా స్థానాలకు వెళ్లేందుకు తిరుగు ప్రయాణం అవుతున్నారు. పార్వతీ పురం, బొబ్బిలి, విజయ నగరంలో ప్రయాణికు లకు తగ్గట్టుగా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. రైలులో ప్రయాణం చేసేందుకు రైల్వే స్టేషన్‌కు అధిక సంఖ్యలో చేరుకోవడంతో బొబ్బిలి, విజయనగరం రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. రైలు ఎక్కేందుకు జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ కు శుక్రవారం ఉదయం నుంచి తాకిడి ఎక్కువగా ఉంది. దీంతో బస్సులలో సీట్ల కోసం ప్రయాణికులు ఫీట్లు చేయాల్సి వచ్చింది.



బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు



బొబ్బిలిలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సీట్ల కోసం ప్రయాణికుల ఫీట్లు



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న గొంప వెంకటరావు, నాయకులు

కాజ్‌వే నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామానికి వెళ్లే మార్గంలో రైవాడ కాలువపై కాజ్‌వే నిర్మించాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన ఆ పార్టీ నాయకులు.. జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నంలోని జివిఎంసి కార్యాలయంలో ఆయనను కలిసి వినతి అందించారు. రైవాడ కాలువపై శిథిలావస్థకు చేరిన కాజ్‌వే ఇటీవల కూలిపోయిందని ఆయన తెలిపారు. కాజ్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బల్లంకి ఉపసర్పంచ్ పల్లి ధనుంజయ, గొంప కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-బొబ్బిలి

కోర్టులో మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు కోరారు. స్థానిక కోర్టులో శుక్రవారం లోక్ అదాలత్‌పై ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ లో సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులను ఇరువర్గాలు రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకుంటే విలువైన సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులను సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ కోరారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు, పోలీసులు పాల్గొన్నారు.

స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయండి

ప్రజారోగ్య సిబ్బంది సమావేశంలో కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిశుభ్రత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఈ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 నెలలకు, 12 అంశాలతో కూడిన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు, సమన్వయంతో స్వచ్ఛత ప్రాధాన్యత పై ప్రజల్లో అవగాహన కల్పించి, అందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు కోట వద్ద నుండి మానవహారం, ప్రతిజ్ఞ, మాస్ క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో జరుగుతున్న సంఘటనల పట్ల మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్య పానం,బెల్ట్ షాప్ నిర్వహణ, కోడి పందాలు, పేకాట వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రత్యేకించి బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉందన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

సైబర్ క్రైమ్ పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం సంకల్పరథంతో విజయనగరం గ్రామీణ ప్రాంతాలైన ద్వారపూడి, గుంకాలం, జమ్ము, విటి అగ్రహారం, బిసి కాలనీ తదితర ప్రాంతాల్లో గంజాయి, సైబర్ నేరాలపై సంకల్ప రథం ద్వారా అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు , మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికీ అనవసరంగా ఆధార్ కార్డు నెంబర్లు, బ్యాంక్ అకౌంట్ నెంబరు పంపరాదన్నారు. ఆన్ లైన్ గేమ్స్ ఆడవద్దన్నారు. మోసపూరిత మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

హోమియో వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

హోమియో వైద్య సేవలు వినియోగించుకోవాలని డాక్టర్ పి. సుమలత కోరారు. శుక్రవారం ఆమె సతివాడ పిహెచ్‌సిలో హోమియో డాక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ తాను పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా హోమియో డాక్టర్ గా ఎంపికయి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. సతి వాడ ప్రాంత ప్రజలు, మండల వాసులు మోమియో వైద్య సేవలు వినియోగించు కోవాలని కోరారు. సతివాడ లో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

గిరిజనులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని కేసాయివలసలో గిరిజనులకు శుక్రవారం గాంధీ స్మారక నిధి సభ్యులు దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్మారక నిధి అధ్యక్షుడు యం.విజయ మోహన్ రావు ఆధ్వర్యంలో వనమిత్ర కృష్ణ దాస్, జి.ధనంజయ, ఎస్. తిరుపతి నాయుడు కలసి వీటిని పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా విజయ మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి నెలా పాత బొబ్బిలి బస్టాప్ వద్ద ఉన్న దయ గల గోడ నుండి సేకరించిన వివిధ రకాల దుస్తులను బొబ్బిలి మక్కువ సాలూరు తదితర గిరిజన ప్రాంతాలకు అందజేస్తున్నామని తెలిపారు.



కేన్సర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

కేన్సర్ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

శ్రీ గురుదేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ కేన్సర్ ఆస్పత్రిని శుక్రవారం రాత్రి త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ రోగులకు అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ కార్పొరేట్ వైద్య సేవలు అందించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. అనంతరం ట్రస్ట్ ద్వారా 30 మందికి వికలాంగులకు ఉచిత కృత్రిమ అవయవాలు, వీల్ ఛైర్స్, చంక కర్రలు, చెవిటి మెషిన్లు. ఆంధులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్‌ట్రస్టు ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.మాధవ్, చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్, వైస్ చైర్మన్ ఫణీంద్ర, రత్నాకర్, కొత్తవలస పిహెచ్‌సి వైద్యాధికారి డి. సీతలవర్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా టిడ్కో ఇళ్లు

మౌలిక వసతులు కరువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

> సుమారు పదేళ్ల క్రితం టిడిపి ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లు నేటికీ నిరుపయోగంగానే ఉన్నాయి. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై అధికారులు ఒత్తిడి చేస్తున్నా నివాసానికి అనుకూల వాతావరణం లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు.

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తదుపరి ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. జిల్లా పరిధిలో విజయనగరంలోని సారిపల్లిలో 2880 ఇళ్లను, సోనియానగర్ 1320 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇళ్లలో 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల చొప్పున మూడు విభాగాల్లో నిర్మాణం చేపట్టారు. ఎన్నికలకు ముందు లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్నింటిలో లైట్లు లేవు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. తాళాలు ఇచ్చారు తప్ప టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే లబ్ధిదారులు ఇళ్లలో చేరాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. మౌలిక వసతులు లేని ప్రాంతాల్లో ఎలా నివాసం ఉండగలమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని చక్కదిద్ది లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

ఇటీవల కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు టిడ్కో ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు రూ.19కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, దానిలో ఇప్పటివరకు రూ.11 కోట్లు వరకు ఖర్చు చేసి పనులను పూర్తి చేశామని తెలిపారు. అప్రోచ్ రోడ్డు, సిసి రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణం కొంత పెండింగ్‌లో ఉంది. గత ఆరునెలలుగా పనులు ఆపివేసినందుకు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో అప్రోచ్ రోడ్డును, సుమారు 1.8 కిలోమీటర్ల మేర పెండింగ్‌లో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తక్షణమే వీధిదీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో మరుచటి రోజే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కానీ ఇంకా పలు సమస్యలు లబ్ధిదారులను వెంటాడుతునే ఉన్నాయి.



నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయం

అద్దె ఇళ్లే దిక్కు

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

నెలకోరోజు స్వచ్ఛత కార్యక్రమాలు

- ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛత దివస్
- ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, స్వచ్ఛ జిల్లాగా రూపొందించడమే లక్ష్యం
- నేడు జిల్లా వ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాలు : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి- వేపాడ

నెలలో ప్రతీ మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛత దినోత్సవంగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో అన్ని గ్రామాలు, వార్డుల్లో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ పరిశుభ్రమైన, స్వచ్ఛ జిల్లాగా రూపొందించడంలో భాగంగా జిల్లా కేంద్రంలోను, అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఇకపై ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత దినోత్సవంగా పాటించి స్వచ్ఛతకు సంబంధించి ఒక్కో నెల ఒక్కో అంశంపై కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వేపాడ మండల కేంద్రం నుంచి జిల్లా అధికారులు, తహశీల్దార్‌లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వచ్ఛత దివస్ నిర్వహణపై సూచనలు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని ఆయా కార్యాలయాల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని తెలిపారు. వారే తమ శాఖకు సంబంధించి ఈ కార్యక్రమాలను సమన్వయం చేసుకోవాలన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్నిప్రాంతాల్లో ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యార్థులు, స్వయంశక్తి మహిళలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు తదితర అన్నివర్గాల భాగస్వాములయ్యేలా ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌లు కార్యక్రమాలను రూపొందించాలన్నారు. రానున్న రోజుల్లో స్వచ్ఛ దినోత్సవంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలపై విజయనగరం కమిషనర్ పి.నల్లనయ్య వివరించారు. శనివారం ఉదయం నగరంలోని కోట వద్ద పరిశుభ్రతపై మానవహారం నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలపై డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి వివరించారు. డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, సిపిఒ బాలాజీ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా నేడు రక్తదానం

ప్రజాశక్తి-బొబ్బిలి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా బొబ్బిలి కోటలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. ఉదయం 8.30గంటలకు ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పూలమాల వేసి నివాళు లర్పిస్తారని, అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎన్టీఆర్ అభిమానులు, తెలుగు యువత నాయకులు పాల్గొనాలని కోరారు.

వేపాడ : కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని వేపాడలో శనివారం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. వేపాడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమానికి మండలంలోని గ్రామ కమిటీల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

త్వరితగతిన ఓటర్ల నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సుదర్శనరావు

ప్రజాశకి-నెల్లిమర్ల

బిఎల్‌ఒలు త్వరిత గతిన ఓటరు నమోదు పూర్తి చేయాలని తహశీల్దార్ పి.సుదర్శనరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల డిటి వివిఆర్ జగన్నాథరావు ఆధ్వర్యంలో బిఎల్‌ఒలతో సమావేశం జరిగింది. సమావేశంలో తహశీల్దార్ సుదర్శన రావు మాట్లాడుతూ త్వరితగతిన ఓటరు నమోదు పూర్తి చేయాలని, ఈనెల 22న జరుగనున్న సమావేశం నాటికి బిఎల్‌ఒలు రిజిస్టర్‌లు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో జరిపించాలని సూచించారు. మండలంలో సీనియర్ ఓటర్లను ఎంపిక చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. ప్రతీ పోలింగ్ కేంద్ర పరిధిలో సీనియర్ ఓటర్లు ను ఎంపిక చేసుకోని జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సన్మానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ సుదర్శనం, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, ఆపరేటర్‌లు మహేష్, భాస్కరరావు బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

రీ సర్వే వినతులు పరిష్కారం కావాలి

అలసత్వం వహించే వారిపై చర్యలు ● రెవెన్యూ అధికారుల సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రీ సర్వే వినతులను పిజిఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేయడం, చేసిన వాటిని వెంటనే పరిష్కరించడం ఏకకాలంలో జరగాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. అప్‌లోడ్ చేసిన వాటిని పరిష్కరించకపోవడం వలన వాటి సంఖ్య ఆన్‌లైన్‌లో ఎక్కువగా కనపడుతోందని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రీ సర్వే, రెవిన్యూ సదస్సులో అందిన వినతులపై తహశీల్దార్లు, సర్వేయర్లతో మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే వినతుల పరిష్కారానికి మండల వారీగా లక్ష్యాలను ఇచ్చి వేగంగా పరిష్కారం జరిగేలా చూడాలని జెసి సేతు మాధవన్‌కు సూచించారు. ప్రతిరోజూ సమీక్షించాలని, లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయని వారి ఇంక్రిమెంట్లను నిలుపుదల చేయాలని సూచించారు. సర్వేశాఖ ఎడి కూడా ప్రతి రోజూ పర్యవేక్షించాలని , సర్వేయర్ల పనితీరు పై ఆగ్రహం వ్యక్తం చేసారు.

రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులలో డూప్లికేషన్ తీసేసి మిగిలిన వాటిని పిజిఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని తహశీల్దార్లకు ఆదేశించారు. రెవిన్యూ వినతులను సబ్జెక్టు వారీగా వర్గీకరించి ఆర్‌డిఒలు పంపాలని, డిఆర్ఒ వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు, డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సిపిఎం నేత జ్యోతిబసుకు నివాళులు

ప్రజాశక్తి-మెంటాడ

సిపిఎం అగ్రనేత, పశ్చిమబెంగాల్ మాజీ సిఎం కీర్తిశేషులు జ్యోతిబస్సు 16వ వర్ధంతిని ఆగూరు, మెంటాడ మండల కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. జ్యోతి బస్సు చిత్రపటానికి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాకోటి రాములు, జెవివి నాయకులు గండ్రేటి అప్పలనాయుడు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రజలకు విశేష సేవలు అందించారన్నారు. భూపంపిణీ, విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.సోములు, నాయకులు సిహెచ్ కృష్ణవేణి, పెంచాలి రాములమ్మ పాల్గొన్నారు.



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాకోటి రాములు, తదితరులు



పోటీలో పాల్గొన్న ఎడ్లబండి

హోరాహోరీగా ఎడ్లబళ్ల పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి గ్రామంలో శుక్రవారం పైడితల్లమ్మ జాతర సందర్భంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో 17 ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన మొదటి ఎడ్లబండి యజమానికి రూ.20 వేలు, రన్నర్‌కు రూ.18 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.16 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. నాలుగు, ఐదు, ఆరో స్థానాల్లో నిలిచిన వారికి రూ.14 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు చొప్పున అందించారు. నగదును గ్రామ సర్పంచ్ సేనాపతి లీల, గ్రామ పెద్ద అప్పారావు, గ్రామ నాయకులు, పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు.

11 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరంకోట

అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామారావు, సిబ్బంది మెంటాడ మండలం ఉద్దంగి గ్రామంలో 11 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న తాడ్డి నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి గజపతినగరం ఎక్సైజ్‌శాఖ సిఐకు బదిలీ చేశారు. రైడ్ లో హెచ్ సి నాగేశ్వరావు ఈసీ నాయుడు, ధనలక్ష్మి పాల్గొన్నారు

200 లీటర్ల బెల్లపు ఊటలు ధ్వంసం

కొత్తవలస మండలం, రామలింగాపురం గ్రామం శివారులో 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలు ధ్వంసం చేశారు. ఈ దాడిలో హెచ్ సి రాంబాబు, ఇసి నాయుడు, మనోజ్ పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్



మాట్లాడుతున్న ఎపిడి కిరణ్‌కుమార్

మండలంలోని ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిడి పి.కిరణ్‌కుమార్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నాలుగు మండలాల ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల చెరువులు, ఫామ్ పాంట్స్, రింగ్ ట్రెంచెస్, బౌండ్రీ ట్రెంచెస్, అమృత్ సరోవర్ లాంటి వ్యవసాయ సంబంధమైన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చేయించాలని తెలిపారు. కనీస వేతనం రోజుకు రూ.300వేతనదారుడికి లబ్ధి పొందేలా పనిచేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.రవి కుమార్ తెర్లాం, రామభద్రపురం, బాడంగి , బొబ్బిలి మండలాల టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉద్యోగ,ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చించపోవడం అన్యాయమని, దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛను దారులు తీవ్ర నిరాశకు గురయ్యారని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు అన్నారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఎనిమిదో వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేబినెట్ సమావేశంలో 12వ వేతన సవరణ సంఘ నియామకం, మధ్యంతర భృతి ప్రకటనపై చర్చించి, కేబినెట్ ఆమోదం తెలిపే దిశగా చర్యలు తీసుకుంటుందని ఆశించామన్నారు. కానీ ఆ దిశగా నిర్ణయం తీసుకోపోవడం న్యాయబద్ధంగా లేదన్నారు. తక్షణమే 12 వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని, సుదీర్ఘ కాలంగా బకాయిపడిన కరువు భత్య బాకాయిలను చెల్లించాలని, పిఎఫ్ ఖాతాలకు 8 నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను కొనసాగిస్తూ అక్కడ పాఠశాల సహాయకులను కొనసాగించాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షులు జోగినాయుడు, బొబ్బిలి మండల శాఖ అధ్యక్షులు సి హెచ్ జె ప్రవీణ్ కుమార్, సిపి ఎస్ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, కుందా శ్రీను, రామ కష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు కె. జోగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీలు నిలబెట్టుకోకుంటే ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గత ఐదేళ్లగా రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు వారి జీతాలు మినహా మరి ఏ ఇతర ఆర్థిక పరమైన లబ్ధి పొందలేదని తెలిపారు. సరెండర్ లీవులు, డిఎ ఎరియర్స్, పిఆర్‌సి బకాయిలు, రెండేళ్ల నుంచి ఎపిజిఎల్ఐ పాలసీలు మెచ్యూర్ అయినప్పటికీ వాటి చెల్లింపులు మరిచారని, ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలు 32 వేల కోట్లు ఉండగా ఈ సంక్రాంతికి కేవలం 10 శాతం మాత్రమే చెల్లించారని మిగిలిన 90 శాతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘం సంబంధించిన కమిషన్ ఏర్పాటు ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని అన్నారు. గత ప్రభుత్వం వలే ప్రస్తుత ప్రభుత్వం కూడా బడ్జెట్ పేరు చెప్పి ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్యాయం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ ర్ ఎం. మురళి, జిల్లా ఆర్థిక కార్యదర్శి బి.ఈశ్వర రావు నాయకులు పి.రాంబాబు, టి.నాగేశ్వరరావు, పి. వెంకట రమణ పాల్గొన్నారు.